www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 23 జనవరి 2025
5
తిరుపతి



కార్తీక్‌కు కన్నీటి వీడ్కోలు


వీర జవాన్ పాడెను మోస్తున్న ఆర్మీ అధికారులు

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: భారతమాత కోసం జమ్మూ కాశ్మీర్‌లో ఉగ్రవాదుల కాల్పులలో గాయపడి వీర మరణం పొందిన అమర జవాన్ కార్తీక్ యాదవ్‌కు తల్లి దండ్రులు, ఎగువ రాగిమాని పెంట గ్రామస్తులు కన్నీటి వీడ్కోలు పలికారు. 28 ఏళ్ల బిడ్డను పోగొట్టుకున్న ఆ తల్లి శోకం తీరనిది. కానీ దేశం కోసం బిడ్డ ప్రాణాలర్పించాడని ఆ తల్లిదండ్రులు సెల్వి, వరదరాజులు, అన్న రాజేష్ గర్వపడుతున్నారు. ప్రభుత్వ అధికార లాంఛనాలతో బుధవారం చిత్తూరు జిల్లా స్వగ్రామమైన బంగారుపాళ్యం మండలం ఎగువ రాగిమానిపెంటలో మధ్యాహ్నం 3.45 గంలలకు అంత్యక్రియలు ముగిశాయి. డెత్ సర్మనీ పరేడ్‌లో 4/8 గుర్ఖా రైఫిల్ బెటాలియన్ లెఫ్టినెంట్ శివరాజ్ సింగ్ గిల్ నేతృత్వంలో 35 మందితో పెరేడ్ నిర్వహించి గౌరవ వందనం చేశారు. 23 మంది పెరేడ్ చేసి గాలిలోకి కాల్పులు చేశారు. అనంతరం అంత్యక్రియలను పూర్తిచేశారు. ఈ అంతిమ సంస్కారానికి కలెక్టర్ సుమిత్ కుమార్, పూతలపట్టు, చిత్తూరు ఎమ్మెల్యేలు కె.మురళి మోహన్, గురజాల జగన్మోహన్, చిత్తూరు నగర మేయర్ అముద, చుడా చైర్‌పర్సన్ కటారి హేమలత, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, పలమనేరు ఆర్డిఓ భవాని, బంగారుపాళ్యం తహశీల్దార్ బాబు రాజేంద్రప్రసాద్, మాజీ సైనికుల సంక్షేమ సంఘం, ఎంఈజీ సంఘం, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు, ప్రజలు పెద్దఎత్తున విచ్చేశారు.

'పాడి'పై మరణ మృదంగం!

- కళ్లెదుటే కడతేరుతున్న మూగజీవాలు
- వందల సంఖ్యలో మృత్యువాత
- ఆందోళనలో పాడి రైతులు


వ్యాధితో మృతి చెందిన మూగజీవాలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: విభజిత తిరుపతి జిల్లాలోని తూర్పు మండలాల్లో అధికశాతం మంది పాడి పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నారు. కరువు కాటకాలకు ప్రత్యామ్నాయంగా పాడి పరిశ్రమను నమ్ముకుని బతుకుతుంటారు. అయితే మనిషి మనుగడకు దోహదపడే పశు సంపదను పరిరక్షించడంలో పశుసంవర్ధకశాఖ నిర్లక్ష్యం వహిస్తోందన్న విమర్శలు వస్తున్నాయి. శ్రీకాళహస్తి, తొట్టంబేడు, ఏర్పేడు, బుచ్చినాయుడుకండ్రిగ, వరదయ్యపాళెం, కేవీబీపురం, సత్యవేడు మండలాల్లో మూగజీవాలు మృత్యువాత పడుతుండటమే ఇందుకు ఉదాహరణ. గొంతువాపు, గాలికుంటు, పిల్లి ముసర, కొక్కెర తెగులు, అంతుచిక్కిన వైరస్‌లు మరణ మృదంగం ఆడుతూ మూగ జీవాలను పొట్టన పెట్టుకుంటున్నాయి. కళ్లెదుటే నోరులేని పశువులు, మేకలు, గొర్రెలు, కోళ్లు కడతేరి పోతుండడంతో పాడి రైతుల బాధలు వర్ణనాతీతం. ముందస్తు వ్యాధి నిరోధక టీకాలు వేయాల్సిన పశు వైద్యాధికారులు 'చేతులు కాలాక.. ఆకులు పట్టుకున్న చందాన ఇప్పుడిప్పుడే టీకాలు వేస్తుండటం విమర్శలకు దారి తీస్తోంది. కొన్ని చోట్ల సకాలంలో టీకాలు వేసినా అవి పనిచేయకపోవడంతో పశు సంపద తరిగిపోతోంది. బూస్టర్ డోస్‌లు ఇచ్చివుంటే పరిస్థితి వేరుగా ఉండేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

వందల్లో మృత్యువాత

తూర్పు మండలాల్లోని పశువులను ప్రస్తుతం గొంతువాపు, గాలికుంటు, లంపీ స్కిన్ వ్యాధులు గజగజ వణికిస్తు న్నాయి. గొంతు వాపు, లంపీ స్కిన్ వ్యాధుల కారణంగా వందల సంఖ్యలో దూడలు మృత్యువాత పడ్డాయి. తొట్టంబేడు మండలంలోని చియ్యవరం గ్రామంలో సుమారు 150 వరకు దూడలు చనిపోయినట్లు పాడి రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పదుల సంఖ్యలో పెద్ద బర్రెలు, ఆవులు కూడా చనిపోయినట్లు వాపోతున్నారు. అంతుచిక్కని వైరస్ వల్ల చనిపోయిన కోళ్ల సంఖ్యను చెప్పలేమంటున్నారు రైతులు. డిసెంబరులో ఏర్పడ్డ వరుస తుపానుల వల్ల పారిశుధ్యం దెబ్బతినడం, జనవరిలో ఒక వైపు అనుకోని వర్షాలు, ఇంకో వైపు చలి తీవ్రత పెరగడం వంటి కారణాల వల్ల అంతు చిక్కని వైరస్ కోళ్లను కబళిస్తోందని రైతులు చెబుతున్నారు. కరోనా లక్షణాలే కోళ్లలో కనిపిస్తున్నాయని, రాత్రికి రాత్రే ఊపిరితిత్తుల సమస్యతో జీవాల ఊపిరి ఆగిపోతున్నట్లు చెప్తున్నారు. ముఖ్యంగా జాతి కోళ్లు, పెరటి కోళ్లు, పందెం కోళ్లకు ఈ వైరస్ సోకడం వల్ల అపార నష్టం వాటిల్లుతోంది. ఇక కొక్కెర తెగులు తన ప్రభావాన్ని చూపుతుండడంతో నాటు కోళ్లు కుప్పకూలిపోతున్న పరిస్థితి ఏర్పడింది. పిల్లి ముసర వ్యాధి ఎక్కువ శాతం మేకలను బలిగొంటోంది. వ్యాధిని గుర్తించే లోపే జీవాలు మృత్యువాత పడుతుండడంతో రైతుల ఆవేదన అంతా ఇంతా కాదు. తూర్పు మండలాల్లోని ప్రతి గ్రామాన పాడిపై వ్యాధులు మరణ మృదంగం మోగిస్తున్నాయి.

కొరవడిన అవగాహన

తిరుపతి జిల్లా వ్యాప్తంగా 67,406 మంది బర్రెల పెంపకం దారులు, 86,591 మంది ఆవుల పెంపకం దారులు, 23,925 మంది గొర్రెలు, మేకల పెంపకం దారులు ఉన్నారు. అయితే పాడి రైతులకు మూగజీవాలకు వచ్చే వ్యాధుల పట్ల అవగాహన కరువైంది. ఏ కాలంలో ఏ వ్యాధులు సంక్రమిస్తాయి? టీకాలు వేసుకోవడం, వ్యాధులు సంక్రమిస్తే చికిత్సలపై అవగాహన లేకుండా పోయింది. ఈ అంశాలపై పాడి రైతులకు విరివిగా అవగాహన కల్పించడంలో పశు వైద్యుల లోపం కనిపిస్తోందన్న విమర్శలు ఉన్నాయి. వర్షాకాలంలో పశు పక్షాదులకు వ్యాధులు వస్తుంటాయి. వ్యాధులు రాకుండా పశు సంవర్ధక శాఖా సిబ్బంది ముందస్తుగా వ్యాధి నిరోధక టీకాలు వేయాల్సి ఉంటుంది. అంటే టీకా పనిచేసే కాలం 5 నుంచి 6 నెలలు వరకూ ఉంటుంది. దీన్ని దృష్టిలో వుంచుకుని జూన్, జూలై నెలల్లో పశువైద్యాధికారులు టీకాలు వేస్తుంటారు. అయితే సకాలంలో టీకాలు వేయకపోవడంతో ప్రాణాంతక గొంతు వాపు వ్యాధి, గాలి కుంటు, చిటుకు వ్యాధులు ప్రబలి మూగజీవాల ప్రాణాలు తీస్తున్నాయి. గొంతు వాపు వ్యాధి సోకితే ఆవు కానీ, బర్రె కానీ అతి తక్కువ రోజుల్లోనే మృతి చెందుతుంది. చిటుకు వ్యాధి వస్తే గొర్రెలు, మేకలు గంటల వ్యవధిలోనే మరణిస్తాయి. గాలి కుంటు వ్యాధి సోకితే పశువుల మరణాలు తక్కువే అయినా పాల దిగుబడి గణనీయంగా తగ్గిపోతుంది. పశువు బలహీనమై పోతుంది. ఈ వ్యాధుల నివారణకు టీకాలొక్కటే మార్గం. అయితే ముందస్తుగా టీకాలు వేయాల్సిన అధికారులు వ్యాధులు ప్రబలి పశువులు మృత్యువాత పడ్డాక 'చేతులు కాలాక.. ఆకులు పట్టుకున్నట్టు' ఇప్పుడు టీకాల కార్యక్రమాన్ని చేపడుతున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఇకనైనా పశు వైద్యాధికారులు గ్రామాల్లో విరివిగా వైద్య శిబిరాలు నిర్వహించి పాడి రైతులను చైతన్య పరచాల్సిన అవసరం వుంది.

తక్షణమే శిబిరాలు నిర్వహిస్తాం..

వర్షాల కారణంగా పారిశుద్ధం దెబ్బతిన్న నేపథ్యంలో పశువుల్లో, దూడల్లో గొంతు వాపు వ్యాధి దర్శనమిస్తోంది. వ్యాధి ప్రభావిత గ్రామాల్లో వెంటనే వైద్య శిబిరాలు నిర్వహిస్తాం. ఇప్పటికే పశువైద్య సిబ్బంది చాలా గ్రామాల్లో శిబిరాలు నిర్వహిస్తున్నారు. గ్రామాల్లో సాధారణ పరిస్థితిలు నెలకొనే వరకు పాడి రైతులకు పశు వైద్యులను అందుబాటులో ఉంచుతాం.

- డాక్టర్ ఎన్‌వి శ్రీకాంత్ బాబు, ఏడీఏ.

తొక్కిసలాటకు అవకాశమివ్వం

- భక్తులందరూ వివిపిలే
- 30 నిమిషాల్లో అందరికీ దర్శనం
- కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్


ఈవోతో కలిసి మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: వైకుంఠ ఏకాదశి సందర్భంగా టికెట్లు జారీ చేసే సమయంలో తిరుపతిలో తొక్కిసలాట జరిగిన సంఘటనలు శ్రీకాళహస్తిలో జరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటామని తిరుపతి కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. బుధవారం శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో శివరాత్రి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి సమక్షంలో జరిగిన సమావేశంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎటువంటి సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. మహాశివరాత్రికి వచ్చే భక్తులందరూ వీఐపీలతో సమానమని, అందరికీ అర్ధగంటలో దర్శనం చేయిస్తామన్నారు. పోలీసు బందోబస్తు భారీగా ఉంటుందని, డ్రోన్ కెమెరాలతో సమీక్ష చేస్తామని తెలిపారు. అంబులెన్స్‌ను అందుబాటులో ఉంచుతామని, క్యూలోని భక్తులకు మంచినీటిని అందిస్తామని తెలిపారు. ఫిబ్రవరిలో మరో సమీక్ష సమావేశం ఉంటుందని, ఒకరిద్దరు మంత్రులు కూడా సమావేశానికి వచ్చే అవకాశాలు ఉన్నాయని ఆయన వివరించారు. ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మాట్లాడుతూ ఆలయానికి వచ్చిన భక్తులందరికీ మంచి దర్శనం చేయిస్తున్నట్లు తెలిపారు. వైసిపి హయాంలో జరిగినట్లుగా ఆలయంలో నేను, నా కుటుంబ సభ్యులు, నాయకులెవరూ కూర్చొని పెత్తనం చేసేది లేదని స్పష్టం చేశారు. మహిళా భక్తులకు జాకెట్, పసుపు, కుంకుమ అందిస్తామని, రాత్రి వరకు అన్నదానం చేస్తా మని తెలిపారు. ఈ సమావేశంలో ఈవో బాపి రెడ్డి, స్థానిక ఆర్డిఓ భాను ప్రకాష్ రెడ్డి పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

12వ పిఆర్‌సిని నియమించాలి

జేసీకి యుటిఎఫ్ వినతి


జెసికి వినతిపత్రం అందిస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: 12వ పిఆర్సి ని నియ మించి, పెండింగ్ లో ఉన్న సరెండర్ లీవ్ ,పిఎఫ్, ఏపీజిఎల్ఐ ,మెడికల్ రీయింబర్సుమెంట్ ,పిఆర్సి, సిపిఎస్ తదితర ఆర్థిక బకాయిలన్నీ చెల్లించేందుకు రోడ్ మ్యాప్ ను ప్రకటించాలని, 2003 ఉద్యోగ నియామకం పోయిందిన ఉద్యోగులు, ఉపాధ్యాయులకు కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వులు 57 ప్రాప్తికి తక్షణం పాత పెన్షన్ వర్తింపజేయాలని, 2024 ఎన్నికల్లో పాల్గొన్న ఉద్యోగ ఉపాధ్యాయుల డ్యూటీ సర్టిఫికెట్లను తక్షణం మంజూరు చేయాలని కోరుతూ తిరుపతి జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ ద్వారా కలెక్టర్ కి యుటిఎఫ్ నాయకులు వినతిపత్రం సమర్పిం చారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా నాయకులు జిల్లా ప్రధాన కార్యదర్శి కే ముత్యాల రెడ్డి,జిల్లా గౌరవాధ్యక్షులు దండు రామచంద్రయ్య, సహ అధ్యక్షులు ఎం కుమారస్వామి, కోశాధికారి కే మోహన్ బాబు ,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దేవరాల నిర్మల, జిల్లా కార్యదర్శిలు ఐ మస్తానయ్య, సి సురేష్, ఏ పద్మజ, ఓ విజయ్ కుమార్, సి వెంకటకృష్ణ, వై విజయశ్రీ, హేమంభదర రావు, గోవర్ధన రెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్లు కోటేశ్వరరావు, ఆర్ నాగరాజు, తిరుపతి డివిజన్ కోఆర్డినేటర్ హస్తి మురళీకృష్ణమరాజు, నాయకులు నాగేశ్వర నాయుడు, రాజేంద్ర బాబు, ధనంజయ, హరిబాబు, చెంచయ్య, సురేంద్ర, ఎన్ సురేష్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

సంక్షేమ వసతి గృహాలను ఆధునీకరిస్తాం: కలెక్టర్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: జిల్లా వ్యాప్తంగా శిథిలావస్థలో ఉన్న సంక్షేమ వసతి గృహాలన్నిటినీ ఆధునీకరిస్తామని కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. శ్రీకాళహస్తి పట్టణంలో ఆధునీకరించిన ప్రభుత్వ మహిళా సంక్షేమ వసతి గృహాన్ని కలెక్టర్ స్థానిక ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డితో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి మహిళా హాస్టల్ దుస్థితిని గమనించి తానే సొంతంగా అభివృద్ధి చేశారని కొనియాడారు. ఇదే తరహాలో జిల్లాలోని అన్ని వసతి గృహాలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దామని హామీ ఇచ్చారు. అందుకోసం రాష్ట్ర ప్రభుత్వం తిరుపతి జిల్లాకు రూ. 6 కోట్లు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. బాలికల కోసం ప్రతినెల కాస్మోటిక్ ఛార్జీల కింద రూ. 250 చెల్లిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో భాను ప్రకాష్ రెడ్డి పాల్గొన్నారు.

సబ్సిడీ ఇళ్ల నిర్మాణానికి దరఖాస్తుల ఆహ్వానం: కమిషనర్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: తిరుపతి నగరంలో సొంత స్థలం కలిగి ఉండి ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0 పథకం కింద ప్రభుత్వ సబ్సిడీ ద్వారా సొంతంగా ఇల్లు నిర్మించుకోవడానికి తిరుపతి నగరంలో అర్హులైన లబ్ధిదారుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తిరుపతి నగరపాలక కమిషనర్ ఎన్.మౌర్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి నగరంలో సొంత స్థలం కలిగి ఉండి పిఎంఎవై 2.0 పథకం కింద ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ ద్వారా 2 లక్షల 50 వేల ప్రభుత్వ సబ్సిడీ ద్వారా సొంతంగా ఇల్లు నిర్మించుకోవడానికి ఆసక్తి ఉన్న లబ్ధిదారులు సమీపంలోని సంబంధిత వార్డు సచివాలయంలో అమెనిటి సెక్రెటరిని కలిసి, లబ్ధిదారుల ఆధార్ కార్డులు, రేషన్ కార్డు, పాన్ కార్డు, కులం సర్టిఫికెట్, ఆదాయ ధ్రువీకరణ సర్టిఫికెట్, ల్యాండ్ డాక్యుమెంట్స్, బ్యాంక్ అకౌంట్ పాస్ బుక్ తదితర పత్రాలను సమర్పించి దరఖాస్తు చేసుకోవాలని కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు.


మాట్లాడుతున్న తిరుపతి జిల్లా మెడికల్ అండ్ డ్రగ్స్ అధికారిణి రీతూ

కాలం చెల్లిన మందులు విక్రయిస్తే కఠిన చర్య

తిరుపతి జిల్లా మెడికల్ అండ్ డ్రగ్స్ అధికారిణి రీతూ హెచ్చరిక

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్:

అనారోగ్యంతో బాధపడే వారికి ఔషధ (మందుల షాప్) దుకాణాదారులు కాలం చెల్లిన మందులు విక్రయించడం నేరమని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తిరుపతి జిల్లా రూరల్ మెడికల్ అండ్ డ్రగ్స్ అధికారిణి రీతూ హెచ్చరించారు. పుత్తూరులోని కే పి ఫంక్షన్ హాల్ లో ఔషధాలు,మందుల విక్రయదారులకు అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ నిషేధిత మందులు విక్రయిస్తే వారిని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. అలాంటి వారి లైసెన్స్ రద్దు చేస్తామన్నారు. ప్రభుత్వ అనుమతి లేని మందులు విక్రయించడం తగదన్నారు. హెచ్ వన్ షెడ్యూల్ డ్రగ్స్ విక్రయించడానికి డాక్టర్ అనుమతితోపాటు, తగు రిజిస్టర్ లో నమోదు చేయాలన్నారు. తమ పరిశీలనలో అనుమతి లేని మందులు దొరికితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. జనరల్, జనరిక్ మందులు విక్రయించే విధానంపై, కాలం చెల్లిన మందులు వున్నాయో..? లేదో ఒకసారి గుర్తించి విక్రయించాలనే అంశాలపై అవగాహన కల్పించారు. ఫార్మాసిస్ట్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఫార్మాసిస్ట్ ధ్రువీకరణ పత్రాన్ని రెన్యూవల్ చేసుకోవాలన్నారు. ఔషధ దుకాణపు యజమాని కనీస విద్యార్హత కలిగి కంప్యూటర్ పరిజ్ఞానం కలిగి వుండాలన్నారు. ప్రతి బిల్లుపై ఎంఆర్‌పి ధరలు వున్నాయో లేదో సరి చూసుకోవాల్లన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా అధ్యక్షులు రత్నం, సెక్రెటరీ రామ్ గుప్తా, ట్రెజరర్ నరసింహారావు, పుత్తూరు మెడికల్ అండ్ డ్రగ్స్ అసోషియేషన్ అధ్యక్షులు వెంకటేష్, ఉపాధ్యక్షులు నరసింహులు, అసోషియేషన్ సభ్యులు, ఔషధ దుకాణాల యజమానులు పాల్గొన్నారు.

స్మార్ట్ సిటీ నిధుల మంజూరుకు కృషి

- శెట్టిపల్లి భూ సమస్య పరిష్కారం
- సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే ఆరణి


సమావేశంలో మాట్లాడుతున్న తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

ప్రజాశక్తి -తిరుపతి టౌన్:

రాష్ట్ర ప్రభుత్వం స్మార్ట్ సిటీ పథకానికి మంజూరు చేయాల్సిన నిధులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి మంజూరు చేయిస్తామని తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో స్మార్ట్ సిటీ పథకం అభివృద్ధి పనులను కార్పొరేషన్ కార్యాలయంలో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం స్మార్ట్ సిటీ పథకంలో రాష్ట్ర వాటా కింద 209 కోట్ల రూపాయల నిధులు రావాల్సిందని ఈ నిధులు రాకపోవడంలో స్మార్ట్ సిటీ ప్రాజెక్టులు కొన్ని పెండింగ్‌లో పడ్డాయని వాటిని పూర్తి చేసేందుకు కృషి చేస్తామన్నారు. తిరుపతి కార్పొరేషన్ పరిధిలో ఉన్న శెట్టిపల్లిని తుడా పరిధిలోకి బదలాయిస్తున్నామన్నారు. శెట్టిపల్లి భూ సమస్య ఓ కొలిక్కి వచ్చే అవకాశం ఉందన్నారు. స్మార్ట్ సిటీ పనులు పెండింగ్‌లో ఉండగా వీటి పూర్తి చేయడానికి నిధులు అవసరమని అధికారులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. తక్షణం 25 కోట్లు రూపాయలు మంజూరు చేస్తే స్మార్ట్ సిటీ పెండింగ్ పనులు పూర్తవుతాయని అధికారులు ఆయనకు తెలిపారు. ఇందుకు సంబంధించి నిధుల మంజూరుకు కృషి చేస్తామని తెలిపారు. తిరుపతి అభివృద్ధి సమన్వయ కమిటీని ఏర్పాటు చేసుకుని నెలలో ఓ రోజు నగర అభివృద్ధిపై సమీక్షించి సమన్వయ లోపం లేకుండా చూస్తే బాగుంటుందని ఆయన అధికారులు సూచించారు. పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్ షిప్ తో పార్కులు అభివృద్ధి చేయాల్సిన అవసరం వుందన్నారు. రాయలచెరువు రోడ్డు రైతు బజార్ ను ఆనుకుని నిర్మిస్తున్న తుడా టవర్స్ ను త్వరగా పూర్తి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ, తుడ సెక్రటరీ వెంకటనారాయణ, సూపరింటెండెంట్ ఇంజినీర్లు కృష్ణారెడ్డి, శ్యాంసుందర్, స్మార్ట్ సిటీ జిఎంచంద్రమౌళి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చంద్రశేఖర్, తిరుపతి నగరపాలక సంస్థ, తుడా ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.



వైద్యశాల అభివృద్ధి కమిటీ నియామకం

ప్రజాశక్తి -సత్యవేడు: సత్యవేడు ప్రభుత్వ కమ్యూనిటీ వైద్యశాలకు సంబంధించి అభివృద్ధి కమిటీని నియమించారు. ఆస్పత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మన్‌గా స్థానిక ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, ఎంపీ డాక్టర్ గురుమూర్తి సభ్యులుగా, ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ సురేష్ కన్వీనర్‌గా, సభ్యులుగా పట్టణంలోని తంబుశెట్టి వీధిలో నివసిస్తున్న సామాజిక సేవ కార్యకర్త హేమభూషణం, దళితవాడలో నివసిస్తున్న మరో సామాజిక సేవకులు, దనేష్ కుమార్, పిల్లారి గుడి వీధిలో నివసిస్తున్న మండల మహిళా సమైక్య మహిళా కార్యకర్త శోభలను సభ్యులుగా నియమితులయ్యారు. ఈ మేరకు ఆస్పత్రి అభివృద్ధి కమిటీని నియమిస్తూ వైద్య ఆరోగ్య ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేసినట్టు కమ్యూనిటీ వైద్యశాల వైద్యాధికారి డాక్టర్ సురేష్ తెలిపారు.


సత్యవేడులో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి: సిపిఎం

ప్రజాశక్తి -సత్యవేడు: ఫిబ్రవరి 1,2,3 వ తేదీ లలో నెల్లూరులో నిర్వ హిం చనున్న సిపిఎం రాష్ట్ర మహా సభలను జయప్ర దం చేయాలని సిపిఎం నాయ కులు పిలుపు నిచ్చారు. సత్యవేడు సిపిఎం కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు మహా సభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దాసరి జనార్ధన్, సత్యవేడు మండల కార్యదర్శి మెలుగు రమేష్ మాట్లాడుతూ నెల్లూరు లో ఫిబ్రవరి నెల ఒకటి, రెండు, మూడు తేదీలలో నిర్వహించనున్న రాష్ట్ర 27వ మహాసభలకు భారీ సంఖ్యలో ప్రజలు తరలి వచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. పొలిట్ బ్యూరో సభ్యురాలు బృందా కారత్, బివి రాఘవులు, ఎంఏ బేబీ, రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు, మాజీ ఎంపీ మధు, తదితర పార్టీ అగ్ర నేతలు పాల్గొననున్న సభకు భారీగా తరలి వచ్చి జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మునస్వామి, మురళి తిరుమలరెడ్డి, అరుణ్ కృష్ణయ్య, రాజీవ్ రాణి పాల్గొన్నారు.

కేవీబీపురం: సిపిఎం రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను కేవీబీపురం మండల సిపిఎం కార్యాలయంలో ఆ పార్టీ మండల కార్యదర్శి నాగరాజ్ ఆధ్వర్యంలో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల్లూరులో నిర్వహించనున్న సిపిఎం రాష్ట్ర మహాసభకు మండలంలోని ప్రజలు, కార్మికులు, ఉద్యోగులు, బిల్డింగ్ వర్కర్స్, రైతులు ప్రతి ఒక్కరూ తరలి వచ్చి జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో ముని శంకర్, మహిళా సంఘం అధ్యక్షురాలు వరలక్ష్మి, మునెమ్మ, బత్తెమ్మ, రేవతి పాల్గొన్నారు.

అమాయకుల్ని మోసం చేస్తున్న ముఠా గుట్టురట్టు


వ్యక్తి అరెస్ట్, రూ25 లక్షల నగదు స్వాధీనం


పోలీసుల అదుపులో మోసగిస్తున్న ముఠా

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: డిజిటల్ అరెస్టు పేరుతో అమాయకుల్ని మోసం చేస్తున్న ముఠా గుట్టును తిరుపతి పోలీసులు రట్టు చేశారు. మోసానికి పాల్పడుతున్న ఓ వ్యక్తిని అదుపులో తీసుకొని అతను వద్ద నుంచి 24. 5 లక్షల నగదు, రెండు సెల్లు ఫోన్లు, రెండు లాప్‌ట్యాప్స్, 16 గ్రాముల బంగారు స్వాధీనం చేసుకొని, నిందితుడు అకౌంట్లో నుంచి 24 లక్షల నగదు నిలుపుదల చేసినట్లు తిరుపతి ఇన్‌ఛార్జి యస్పీ మణికంఠ చందోల్ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తిరుపతికి చెందిన సీనియర్ సిటిజన్ సుమారు 65 సంవత్సరాలు వయసు కలిగిన మహిళ తన ఇంటిలో ఉండగా వాట్స్‌అప్ ద్వారా ఒక వీడియో కాల్ వచ్చింది. అవతల వ్యక్తి తనను తాను ఢిల్లీ సిబిఐ అధికారులమని చెప్పి 200 కోట్లు మనీ ల్యాండరింగ్ కేసు జరిగిందని, బాధితురాలు పేరుపై ఉన్న బ్యాంక్ అకౌంట్‌ను చట్ట వ్యతిరే కార్యకలాపాలకు వినియోగిస్తూ, లావాదేవీలు జరుపుతున్నారని, అందువల్ల అరెస్ట్ చేస్తామని భయభ్రాంతులకు గురి చేశారు. వివిధ అకౌంట్లకు ఆమె నగదు ట్రాన్స్‌ఫర్ చేస్తే వాటిని పరిశీలించి సదరు డబ్బులు మనీల్యాండరింగ్ కేసులో ఇన్వాల్వ్ కాకపోతే రిలీజ్ చేస్తామని మాయ మాటలు చెప్పి నమ్మించి ఆమె వద్ద నుంచి 2.5 కోట్లు నగదును వివిధ అకౌంట్లో జమ చేసుకున్నారు. తరువాత వారు స్పందించకపోవడంతో బాధిత మహిళ ఈనెల 13 తేదీన తిరుపతి వెస్ట్ పోలీస్ పోలీసులు సంప్రదించి ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తులో భాగంగా జిల్లా ఎస్పి కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకోని తిరుపతి సైబర్ క్రైమ్ టీం, వెస్ట్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కేసు దర్యాప్తు చేపట్టి, నిందితుడి అకౌంట్లులో ఉన్న 26 లక్షల నగదు లావాదేవీలను ఫ్రీజ్ చేశారు. ప్రధాన నిందితుడు ఇతర సభ్యుల కోసం సీసీఎస్ పోలీసులతో ప్రత్యే క బృందా లు ఏర్పాటు చేసి, తీవ్రంగా గాలిస్తున్నారు. ఇతనికి సహకరించిన ప్రధాన నిందితుడికి అన్న పాలకొల్లు అరుణ్ వినయ్ కుమార్ రాజమండ్రికి చెందిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని, అతని వద్ద నుండి రూ.24.5 లక్షల నగదు, ఒక ఏక్స్ యువి 700 కారు, రెండు సెల్ ఫోన్లు, రెండు ల్యాప్ టాప్లు, 16 గ్రాములు బంగారు, నేరం చేయడానికి సాంకేతికంగా ఉపయోగించిన పరికరాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టుకు తరలించామన్నారు. ఈ కేసులో ప్రతిభ కనబరిచిన వెస్ట్ సిఐ మురళీ మోహన్, సైబర్ క్రైమ్ సిఐ వినోద్ కుమార్, సీసీఎస్ సిఐ ప్రకాష్ కుమార్, ఎస్ఐ లు, సిబ్బందిని జిల్లా ఎస్పి అభినందించి రివార్డ్ ప్రకటించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ వెంకట్రావు, తిరుపతి డి.యస్.పి వెంకటనారాయణ, సిఐ మురళి మోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

కానరాని ఉద్యోగులు

- ఖాళీ సీట్లతో దర్శనమిస్తున్న సచివాలయాలు
- ప్రజలకు అందని సేవలు
- నిరాశతో వెనుతిరుగుతున్న వైనం..


ఉదయం 12 గంటలు అవుతున్నా ఉద్యోగులు లేక వెలవెల బోతున్న సచివాలయం

ప్రజాశక్తి -వాకాడు: సచివాలయ ఉద్యోగులు కానరావడంలేదు. ఉదయం 12 గంటలు అవుతున్నా ఖాళీ సీట్లతో సచివాలయాలు దర్శనమిస్తున్నాయి. దీంతో వివిధ పనుల నిమిత్తం వచ్చిన ప్రజలు నిరాశతో వెనుతిరిగి వెళుతున్నారు.

చిట్టమూరు మండల పరిధిలోని మల్లం - 1, మల్లం-2 సచివాలయాలు పక్క పక్కనే ఉన్నప్పటికీ మధ్యాహ్నం 12 గంటలకు సైతం సచివాలయాలు ఉద్యోగులు లేక ఖాళీ సీట్లతో దర్శమిస్తోంది. ఉన్నవారు ప్రజలకు సహకరించాలన్న ఎవరి లాగిన్లు వారికి సపరేట్‌గా ఉన్నందున కేవలం సమాచారం ఇవ్వటానికి మాత్రమే పరిమితమై ఉన్నారు. వైఎస్ జగన్మోహన్ రెడ్డి లక్షలు ఖర్చు పెట్టి ప్రజల అవసరాల నిమిత్తం సచివాలయాలు నిర్మించినప్పటికీ వాటి వల్ల ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పని మానుకుని సచివాలయం కొచ్చిన పేద ప్రజలు వెనుతిరిగి పోవాల్సి వస్తోంది. ఈ విధానం వలన ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మల్లాంలో ఉన్న సచివాలయం రెండంతస్తుల భవనం లక్షల ఖర్చు పెట్టి ఏర్పాటు చేసినప్పటికీ తలుపులు వేసి నిరుపయోగంగా మారింది. పాత పాఠశాల భవనాలలో మాత్రమే వారు విధులు నిర్వహిస్తున్నారు. చుట్టుపక్కల పల్లంపర్తి జక్కన్న పల్లి మల్లం పిట్టివానిపల్లి నాలుగు పంచాయతీలకి ఉన్నటువంటి చుట్టుపక్కల గ్రామ ప్రజలు ప్రతి ప్రభుత్వ పనుల కొరకు మల్లాం సచివాలయాలకు రావాలి వారు వచ్చిన ప్రతిసారి సచివాలయాల్లో ఉద్యోగుల కొరత వల్ల ఇన్‌ఛార్జిలుగా బాధ్యతలు నిర్వహిస్తున్నవారు కూడా సెలవులో ఉండటం వల్ల లేదా ఇన్‌ఛార్జులు వేరే ప్రాంతాల్లో ఉండడం వల్ల వచ్చిన పని జరగక ప్రజలు నిరాశ చెందుతున్నారు. ప్రభుత్వ పథకాలకు కాలపరిమితి ఇవ్వడం వల్ల వారు సరైన సమయంలో ధ్రువ పత్రాలు సమర్పించలేక ప్రభుత్వ పథకాలను అందుకోలేక ప్రభుత్వ పథకాలు అందని ద్రాక్షలా మారుతున్నాయి. అధికారులు స్పందించి సచివాలయాలను సరి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

భూముల రీ సర్వే ప్రారంభం



భూమి పూజ చేసి భూముల రీ సర్వేను ప్రారంభిస్తున్న తహశీల్దారు కె జెజె రావు

ప్రజాశక్తి -కోట : భూముల రీ సర్వే మళ్ళీ మొదలైంది. బుధవారం కోట మండలంలోని అల్లంపాడు పంచాయతీలో స్థానిక తహశీల్దారు కె జె జె రావు భూముల కొలతలకు(రీ సర్వే)కు శంకుస్థాపన చేసి ప్రారంభించారు. అనంతరం తహశీల్దారు మాట్లాడుతూ మండల పరిధిలో 831.23 ఎకరాలు భూమిని రీ సర్వే చేయాల్సి వుందన్నారు. ఈ నేపథ్యంలోనే బుధవారం రీ సర్వేను ప్రారంభించామన్నారు. ఈ మేరకు రీ సర్వేకు రెవెన్యూ పరిధిలో మొత్తం 4 టీమ్ లను తయారు చేసి రోజుకు ఒక టీమ్ 20 ఎకరాలు భూమిని రీ సర్వే చేసేవిధంగా ప్రణాళికను సిద్ధం చేశామన్నారు. ఈ కార్యక్రమాన్ని సుమారు 10 రోజుల వరకు నిర్వహిస్తామని తెలిపారు. టీమ్ లకు గ్రామ సర్వేయర్, వీఆర్వో, వీఆర్ఏ లు అందుబాటులో ఉండేలా నిర్ణయించారు. రీ సర్వే టీమ్ లో శ్రీనివాసులు, ఏడుకొండలు, సుబ్రహ్మణ్యం, మోహన్ లకు కేటాయించి వారి పరిధిలో మిగతావారు ఉండేలా తహశీల్దార్లు ఏర్పాటు చేశారు. ఉదయం నుండి మధ్యాహ్నం వరకు రీ సర్వే ఉంటుందన్నారు. భూముల విస్తీర్ణం తగ్గిందని, హద్దులు మార్చేశారని, హక్కు పత్రాల్లో తప్పులు దొర్లాయని రైతులు పెద్ద సంఖ్యలో వినతులు అందించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ గోపిరెడ్డి, వీఆర్వోలు కృష్ణ, శ్రీనివాసులు, మోహన్, ఏడుకొండలు, సుబ్రహ్మణ్యం, విలేజ్ సర్వేయర్లు మహేష్, సుబ్రహ్మణ్యం, పలువురు రైతులు పాల్గొన్నారు.

డయాలసిస్ రోగుల కోసం 'ఆశాయెయిన్'

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: నెఫ్రోప్లస్, డయాలసిస్ రోగుల జీవన నాణ్యతను మెరుగుపరచడానికి ప్రముఖ డయాలసిస్ సేవల నెట్‌వర్క్, తిరుపతిలో డయాలసిస్ రోగుల కోసం డిజిటల్ కళ్యాణ మండపం వద్ద ప్రత్యేక 'ఆశాయెయిన్' కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ స్ఫూర్తిదాయకమైన చొరవ డయాలసిస్ రోగులలో పరస్పరం సంభాషించుకునేలా, వారి భావాలను పంచుకోవడానికి, వారి డయాలసిస్ సంకల్పాన్ని పెంపొందించడానికి వారికి ఒక అవకాశం కల్పించడం ద్వారా వారి మనోధైర్యాన్ని పెంపొందించడానికి రూపొందించారు. నెఫ్రోప్లస్ సిబ్బందితో పాటు 250 మందికి పైగా అతిథులు పాల్గొన్నారు. 500 కంటే ఎక్కువ మంది ప్రేక్షకులతో, తిరుపతిలో 'ఆశాయెయిన్' గొప్ప విజయాన్ని సాధించింది. ప్రారంభోత్సవ కార్యక్రమంలో సంప్రదాయ భరతనాట్యం ప్రదర్శించారు. హాజరైనవారికి ఆహ్లాదం, వినోదం కలిగించే వివిధ కార్యక్రమాలు, ప్రత్యేక అతిథి వెబినార్ నిర్వహించారు. అత్యంత అనుభవజ్ఞులైన నెఫ్రాలజిస్టులు, కార్డియాలజిస్టులు, సీనియర్ సిబ్బంది హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో అతిథిగా డాక్టర్ శివప్రసాద్ (సీనియర్ నెఫ్రాలజిస్ట్), డాక్టర్ హేమచంద్ర, అసిస్టెంట్ ప్రొఫెసర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా డయాలసిస్ రోగుల ధైర్యం మరియు పట్టుదలను గౌరవించే అవార్డు ప్రదానం చేశారు.

డిఎస్‌పికి సన్మానం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షులు శివకుమార్ గూడూరు డిఎస్పీ గీతాకుమారిని బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఆమెకు శాలువా కప్పి సత్కరించారు. ఇందులో భాగంగా పలు సమస్యలను ఆయన డిఎస్పీ దృష్టికి తీసుకొచ్చారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని ఓం సాయి రాం వృద్ధాశ్రమంలో శ్రీశ్రీ 'సేవాసమితి అధ్యక్షుడు, మాజీ డిఆర్‌యూసిసి మెంబర్ మయూరి శ్యామ్ యాదవ్ ఆధ్వర్యంలో బుధవారం అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత సేవా దృక్పథాన్ని అలవరచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో, వసతి గృహ నిర్వహుకురాలు కల్యాణి పాల్గొన్నారు.

ఉచిత పశు వైద్య శిబిరం

ప్రజాశక్తి - కెవిబిపురం : కెవిబిపురం గ్రామ పంచాయతీలో ఉచిత పశు వైద్య శిబిరం డాక్టర్ హరీష్ మణికంత ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు . ఈ సందర్భంగాడాక్టర్ హరీష్ పాడి రైతులకు పలు సలహాలు, సూచనలు అందించారు. పశువులకు ఉచితంగా మందులు, వ్యాధి నిరోధక టీకాలు అందించారు. ఈ కర్యక్రమంలో తిరుపతి పార్లమెంటు యువత అధికార ప్రతినిధి అవసరం సురేష్ రెడ్డి, జనసేన అధ్యక్షులు థామస్, మాజీ సర్పంచ్ చెంగారెడ్డి , మాజీ ఎంపిటిసి మునికృష్ణయ్య, సీనియర్ నాయకులు శివరావు, ఆయుకట్టు ఛైర్మన్ వెంకటేష్, రాయపేడు సర్పంచ్ బాలాజీ, మునికృష్ణయ్య , కన్నయ్య, రైతులు పాల్గొన్నారు.

వైసిపి నాయకుడికి పరామర్శ

ప్రజాశక్తి-చిన్నగొట్టిగల్లు: స్థానిక వైసీపి మండల కన్వీనర్ యండపల్లి కొండారెడ్డి తల్లి అచ్చెమ్మ ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వైసీపి నాయకులు, మాజీ ఎమ్మెల్సీ యండపల్లి చెంగారెడ్డి, సామకోటి సహదేవరెడ్డి, ఎంపీపి బాలం యుగంధర్ రెడ్డి, ఎమ్మార్సీ రెడ్డి, రవికుమార్ రెడ్డి, మాజీ సర్పంచ్ భాస్కర రెడ్డిలతో కలసి నాగేవాండ్లపల్లికి చేరుకొని అచ్చెమ్మ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం కొండారెడ్డిని పరామర్శించి ధైర్యం చెప్పారు.

పశువైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - పిచ్చాటూరు: పశు వైద్య శిబిరాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశు వైద్యాధికారిణి ప్రశాంతి తెలిపారు. బుధవారం మండలంలోని కొత్త గొల్ల కండ్రికలో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 100 పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి తగిన చికిత్సలు అందించారు. ఉచితంగా పశులకు మందులు అందించారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది చందన, అజిత్ పాల్గొన్నారు.

ప్రాధాన్యత ఇవ్వండి..

ఆంధ్రప్రదేశ్ వళ్ళువన్ అసోసియేషన్ ప్రసిడెంట్ కె శ్రీరాములు



వినతిపత్రం అందిస్తున్న వళ్ళువన్ అసోసియేషన్ నాయకులు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): వళ్ళువన్ సామాజిక వర్గానికి ప్రాధాన్యత ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ వళ్ళువన్ అసోసియేషన్ ప్రసిడెంట్ కె.శ్రీరాములు మంగళవారం చిత్తూరులో ఏకసభ్య కమిషన్ ఛైర్మన్ రాజీవ్ రంజాన్ మిశ్రమం కలిసి వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఎస్సీ ఉప కులాలలో చిట్ట చివరన ఉన్న వళ్ళువన్ కులానికి సంబంధించి తమిళనాడులో వళ్ళువన్ లను ఎస్సీలుగా ఆ రాష్ట్ర ప్రభుత్వం గుర్తింపు ఇచ్చిందన్నారు. ఏక సభ్య కమిషన్ వారు కూడా తమ వినతిపై తగిన విచారణ జరిపి ప్రాధాన్యతను ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కే.మోహన్, పన్నీర్ సెల్వం, సుందర్ రాజన్, మురళీమోహన్ పాల్గొన్నారు.

టీటీడీ ఎస్‌డబ్ల్యూయుఎఫ్ డైరీ ఆవిష్కరణ

ప్రజాశక్తి -తిరుపతిసిటీ: టీటీడీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యునైటెడ్ ఫ్రంట్ (సీఐటీయూ) 2025 వ సంవత్సర డైరీని టీటీడీ కార్యనిర్వహణాధికారి శ్యామలా రావు బుధవారం ఆవిష్కరించారు. ఈ డైరీ లో ఉద్యోగులకు సంబందించిన సర్వీస్ మేటర్స్,టీటీడీ కి సంబంధించిన చరిత్ర, సేవలు తదితర విషయాలను పొందుపరిచారు. ఈ కార్యక్రమంలో టీటీడీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యునైటెడ్ ఫ్రంట్(సీఐటీయూ) గౌరవ అధ్యక్షులు గోల్కొండ వెంకటేశం, ప్రధాన కార్యదర్శి కాటా గుణ శేఖర్, ట్రెజరర్ ఎన్ పద్మనాభం, కార్యవర్గ సభ్యులు, డి రవికుమార్, ఏ.నరేష, బి హనుమంత్ రెడ్డి, శ్రీలక్ష్మి,వి ఆదిలక్ష్మి, ప్రతిభా భారతి, మురళి మోహన్, చుక్కలింగం, ముని కిరణ్ కుమార్, కుమార్, ఎంపీ సుబ్రహ్మణ్యం రెడ్డి, శివయ్య, సురేష్ పాల్గొన్నారు.

గాయకుడు ఉమాపతికి జాతీయ ఐకాన్ అవార్డు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతికి చెందిన ప్రముఖ నేపధ్య గాయకుడు, కవి సోము ఉమాపతికి వేటూరి సుందర రామ్మూర్తి జాతీయ ఐకాన్ అవార్డు వరించింది. ఉమాపతి సంగీతం, సాహిత్య రంగంలో చేస్తున్న కృషిని గుర్తించిన అభిలాష హెల్పింగ్ యాడ్స్ ఆర్గనైజేషన్ ఐదవ వార్షికోత్సవంతో పాటు సావిత్రి బాయి పూలే జయంతి సందర్భంగా మంగళవారం హైదరాబాద్ లోని రవీంద్ర భారతిలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వివిధ రంగాలలో సేవలందిస్తున్న వారికి జాతీయ స్థాయి అవార్డులను అందించారు. సంస్థ వ్యవస్థాపకురాలు డాక్టర్ ఎస్.సరోజమ్మ పాల్గొన్నారు.

చెత్త బుట్టలు సద్వినియోగం చేసుకోవాలి: కమిషనర్



పారిశుధ్యం పనులు తనిఖీ చేస్తున్న కమిషనర్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని దుకాణ, వాణిజ్య సముదాయాల్లోను, గృహల లోని వారందరూ తప్పకుండా చెత్త బుట్టలు వినియోగించుకుని పారిశుధ్య పరిరక్షణకు సహకరించాలని నగరపాలక కమిషనర్ ఎన్ మౌర్య అన్నారు. నగరంలోని రాయల్ నగర్, మారుతి నగర్, రైతు బజారు, ఎమ్మార్ పల్లి కూడలి, వెస్ట్ చర్చి తదితర ప్రాంతాల్లో బుధవారం ఉదయం కమిషనర్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పలు దుకాణాల వద్ద చెత్త రోడ్లపైనే వేస్తుండడం చూసి మందలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ తాము తనిఖీ చేసిన పలు ప్రాంతాల్లోని దుకాణదారులు చెత్త బుట్టలు వినియోగించకుండా, చెత్తను కవర్లలో వేసి కాలువల్లో పడేస్తున్నా రన్నారు. ఇలా చేయడం వల్ల కాలువల్లో చెత్త పేరుకుపోయి మురుగు నీరు రోడ్లపైకి వచ్చి అపరిశుభ్రంగా తయారవుతుందన్నారు. ప్రజలు, దుకాణ దారులు చెత్త బుట్టలు వినియోగించి మీ వద్దకు వచ్చే తమ సిబ్బందికి చెత్త అందించి నగరం శుభ్రంగా ఉండేందుకు సహకరించ చాలని పిలుపునిచ్చారు. నగరంలోని ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా పరిశుభ్రతకు సహకరించ చాలని కోరారు. కాలువల్లో చెత్త తొలగించాలని, చెత్తను వేస్తున్నారని ఫిర్యాదులు వస్తున్నాయని, ఆ చెత్తను వెంటనే తొలగించాలని అధికారులను ఆదేశించారు. రైతు బజారు వద్ద పరిశుభ్రంగా ఉంచాలని, రోడ్డుపైన వ్యాపారాలు లేకుండా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. రాయల్ నగర్ లోని తుడా పార్కును పరిశీలించి శుభ్రంగా ఉంచాలని, ఆట పరికరాలు మరమ్మతులు చేయించాలని తుడ అధికారులను ఆదేశించారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, తుడ ఈఈ రవీంద్ర, డిఈలు, ఏసిపి బాలాజి, సర్వేయర్ కోటేశ్వర రావు, శ్రీనాథ్ రెడ్డి, శానిటరీ సూపర్ వైజర్ చెంచయ్య పాల్గొన్నారు.

గొప్ప పరిశోధనతోనే ఉత్తమ ఫలితాలు

విశ్రాంత ఆచార్య సుందరరాజన్

ప్రజాశక్తి -రామచంద్రాపురం (చంద్రగిరి): విద్యార్థులు పరిశోధనలు ఎంత గొప్పగా సాగితే అంత మంచి ఫలితాలు పొందవచ్చునని సింగపూర్ లోని నవ్యాంగా టెక్నాలజికల్ విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు సుందర్ రాజన్ అన్నారు. చంద్రగిరి మండలం ఏ రంగంపేట సమీపంలోని ఎంబీయూలో 2024!-25 నందు 5 వ విడత పరిశోధన విద్యార్థులకు పరిశోధన మరియు పబ్లికేషన్స్ అండ్ ఎథిక్స్ అనే అంశం పైన వర్క్ షాప్ నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా పరిశోధన విద్యార్థులను ఉద్దేశించి సుందర్రాజన్ మాట్లాడుతూ పరిశోధన మార్థాన్ పరుగు పందెం లాంటిదని చెప్పారు. పరిశోధించే కొద్దీ కొత్త కొత్త విషయాలు వస్తాయని తెలిపారు. పరిశోధన ఒక గొప్ప యజ్ఞం లాంటిది అన్నారు.విశిష్ట అతిథి మైసూర్ జె ఎస్ ఎస్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఆచార్యులు బిఎస్ మహానంద్ మాట్లాడుతూ విద్యార్థులు విజ్ఞానాన్ని పెంచుకోవడానికి అవసరమయ్యే గ్రంధాలు ఎంబీయూ లోని గ్రంథాలయంలో ఉన్నాయని చెప్పారు.పరిశోధనకు అవసరమయ్యే విషయాలను ఆ గ్రంథాల ద్వారా సమీకరించుకోవచ్చని వివరించారు. ఎంబి యు రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ డీన్ అవిరేని శ్రీనివాసులు మాట్లాడుతూ మోహన్ బాబు విశ్వవిద్యాలయం స్థాపించిన మూడు సంవత్సరాలలోనే 500 మందికి పైగా పరిశోధన విద్యార్థులు తమ పేర్లను నమోదు చేసుకోవడం ఎంతో గొప్ప విషయం అన్నారు.ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ హెూస్ట్ డాక్టర్ నాగరాజు రామారావు ,ఉపకులపతి ప్రొఫెసర్ కరుణాకరన్, రిజిస్టర్ డాక్టర్ సారధి, వివిధ విభాగాల డీన్లు, అధ్యాపకులు విద్యార్థినివిద్యార్థులు పాల్గొన్నారు.

రాకేష్ కుటుంబానికి అండ: పులివర్తి సుధా రెడ్డి



రాకేష్ చౌదరి కుటుంబానికి చెక్కు అందిస్తున్న పులివర్తి సుధారెడ్డి

ప్రజాశక్తి -రామచంద్రపురం (చంద్రగిరి): ఏనుగుల దాడిలో మృతి చెందిన టిడిపి నాయకుడు, కందుల వారి పల్లి ఉప సర్పంచ్ ఎం తరిష్ బాబు (రాకేష్ చౌదరి) కుటుంబానికి టిడిపి, ఎమ్మెల్యే పులివర్తి నాని కుటుంబం అండగా ఉంటుందని పులివర్తి సుధా రెడ్డి అన్నారు. మాడుమానుగడ్డ గ్రామంలో నివాసముంటున్న ఎం రాకేష్ చౌదరి కుటుంబ సభ్యులను బుధవారం అటవీశాఖ అధికారులతో పులివర్తి సుధా రెడ్డి కలిసి పరామర్శించి ఓదార్చారు. స్థానిక టిడిపి నాయకులకు, ప్రజలకు అండదండగా ఉన్న ఎం రాకేష్ చౌదరి మృతి టిడిపికి, స్థానిక ప్రజలకు తీరంలోని ఆవేదన వ్యక్తం చేశారు. ఏనుగుల దాడిలో రాకేష్ చౌదరి మృతి చెందిన విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే పులివర్తి వెంకటమణి ప్రసాద్ (నాని) సీఎం చంద్రబాబు నాయుడు, అటవీ శాఖ మంత్రి కొణిదల పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ ల దృష్టికి తీసుకెళ్లి రాకేష్ కుటుంబానికి ప్రభుత్వం తరపున ఆర్థిక సహాయం అందించాలని కోరగా ప్రభుత్వం ఎం రాకేష్ చౌదరి కుటుంబానికి 10 లక్షల రూపాయలు ఆర్థిక సహాయాన్ని మంజూరు చేసింది. ప్రభుత్వం మంజూరు చేసిన రూ.10 లక్షల రూపాయల చెక్కును రాకేష్ చౌదరి భార్య లక్ష్మి కి, తల్లి జ్యోతిలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో చంద్రగిరి అటవీ శాఖ అధికారిణి అనిత, స్థానిక టిడిపి నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎన్‌టిఎస్‌ఇ స్కాలర్‌షిప్‌ను పునరుద్ధరించండి

కేంద్ర విద్యాశాఖా మంత్రికి ఎంపీ లేఖ

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: జాతీయ ప్రతిభా అన్వేషణ పరీక్ష (ఎన్‌టిఎస్‌ఇ) స్కాలర్‌షిప్‌ను పునరుద్ధరించాలని తిరుపతి ఎంపి మద్దిల గురుమూర్తి కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కి లేఖ రాశారు. ఎన్‌టిఎస్‌ఇ స్కాలర్‌షిప్ గత కొన్ని దశాబ్దాలుగా దేశంలోని ప్రతిభావంతులైన విద్యార్థులను గుర్తించి వారిని ప్రోత్సహించడంలో కీలకపాత్ర పోషించిందని, ఈ పథకం ముఖ్యంగా ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు సహాయం అందించి, వారిని ఉన్నత విద్యను అభ్యసించడానికి ప్రేరేపించిందని ఈ లేఖలో పేర్కొన్నారు. ఈ స్కాలర్‌షిప్‌ను నిలిపివేయడం వల్ల ఇప్పటికే అర్హత సాధించిన అనేక మంది విద్యార్థులు తమ విద్యను కొనసాగించేందుకు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొం టున్నారని ఫలితంగా, వారి భవిష్యత్తు ఆగమ్య గోచారంగా మారే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్‌టిఎస్‌ఇ స్కాలర్‌షిప్‌ను తిరిగి అమలు చేయడం ద్వారా ఈ పథకానికి లబ్ధి పొందిన వారు సకాలంలో ఆర్థిక సహాయాన్ని అందుకొని, భవిష్యత్తు తరాలకు కూడా విద్యా ప్రేరణ అందుతుందని ఆయన ఆకాంక్షించారు. విద్యార్థుల అర్హతలకు గౌరవం ఇచ్చేలా ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని పునఃసమీక్షించి పునరుద్ధరించాలని ఎంపీ ఈ లేఖ ద్వారా కోరారు.

అభివృద్ధి పనులు చేపట్టాలి: ఎమ్మెల్యే

ప్రజాశక్తి- బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని దళితవాడల్లో సిసి రోడుల ఏర్పాటు చేసి అభివృద్ధి చేయాలని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పేర్కొన్నారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సమావేశం వైస్ ఎంపీపీ మునికృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా సత్యవేడు ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని దళితవాడల్లో సిసి రోడ్లు ఏర్పాటు చేసి అభివృద్ధి చేయాలని సూచించారు. ముఖ్య మంత్రి ఆదేశం మేరకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలన్నారు. ప్రతి గ్రామంలో శ్మశాన వాటిక వుండాలని లేదని గ్రామాల్లో వెంటనే మంజూరు చేయాలన్నారు. రైతులు గోకుల షెడ్లు నిర్మించుకోవాలని కోరారు. ఈ సందర్భంగా మండలంలోని సమస్యలు , అభివృద్ధి పనులు అధికారులు ఎమ్మెల్యేకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో త్రివిక్రమ రావు, తహశీల్దారు ఐ సుబ్రహ్మణ్యం, ఎస్ఐ విశ్వనాథ నాయుడు సర్పంచుల సంఘం అధ్యక్షుడు ఆరని విద్యానాథరెడ్డి, ఎంపిటిసిలు, మండల శాఖ అధికారులు పాల్గొన్నారు.

హథీరాంజీ మఠానికి చారిత్రాత్మక గుర్తింపు: ఎమ్మెల్యే



హథీరాంజీ మఠాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): హథీరాంజీ మఠానికి చారిత్రాత్మక కట్టడంగా గుర్తింపు తీసుకురావడానికి కలెక్టర్‌తో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం కూటమి నాయకులతో కలిసి తిరుపతి గాంధీ రోడ్డులోని హథీరాంజీ మఠంను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా మఠాధిపతి ఓం ప్రకాష్ దాస్, మఠం అధికారులు ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. పురాతన కట్టడం కావడంతో ఇటీవల కూలిపోయే పరిస్థితులు ఉన్నాయని, శిథిలావస్థకు చేరిన మఠాన్ని కూల్చివేసి తిరిగి నిర్మించాలన్న ప్రతిపాదికతో ఎమ్మెల్యే మఠం వాస్తవ పరిస్థితులను పరిశీలించారు. మఠం విశిష్టతను, వైభవాన్ని ఎమ్మెల్యేకు కూటమి పార్టీల నాయకులు వివరించారు. అనంతరం మీడియాతో ఎమ్మెల్యే మాట్లాడుతూ హథీరాంజీ మఠం చాలా ప్రాముఖ్యమైందని దీన్ని కూల్చివేయకుండా చారిత్రాత్మక కట్టడంగా గుర్తింపు తీసుకురావడానికి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. అధునాతన టెక్నాలజీని ఉపయోగించి ఈ కట్టడాన్ని నిలుపుకోవడానికి చర్యలు తీసుకుంటామన్నారు. హథీరాంజీ మఠంకు ఆనుకుని ఉన్న దుకాణదారులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మఠం ఏఈఓ శ్రీనివాసులరెడ్డి, పర్యవేక్షణాధికారి కేశవులు, లా ఆఫీసర్ కవిత, టిడిపి తిరుపతి పార్లమెంటు అధ్యక్షులు నరసింహ యాదవ్, కార్పొరేటర్లు నరసింహ చారి, ఆర్ సి మునికృష్ణ, సునీల్ చక్రవర్తి, దుర్గాప్రసాద్, రాజారెడ్డి, లోకేష్, మహేష్ యాదవ్ పాల్గొన్నారు.

తోపుడు బండ్ల వ్యాపారులను ఇబ్బంది పెట్టొద్దు.

- చిరువ్యాపారులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి
- కమిషనర్‌కు సిఐటియు వినతి



కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: తోపుడుబండ్లపై వ్యాపారాలు చేసుకునే చిరు వ్యాపారులను ఇబ్బంది పెట్టొద్దని మున్సిపల్ కమిషనర్‌ను కలిసిన సిఐటియు నాయకులు బుధవారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సిఐటియు నేతలు టి సుబ్రహ్మణ్యం, కే వేణుగోపాల్ హాకర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి బుజ్జి మాట్లాడుతూ నిన్నటి రోజు ప్రకాశం పార్క్ పక్కన, మరికొన్ని ప్రాంతాల్లో మునిసిపల్ అధికారులు తోపుడుబండ్ల వ్యాపారస్తులపై విరుచుకుపడి బండ్లను లాక్కెళ్లి బలవంతంగా ఖాళీ చేయించి ఇక్కడ వ్యాపారం చేసుకోకూడదని బెదిరింపులు చేయడంతో నేడు తోపుడు బండ్ల వ్యాపారస్తులను ఇబ్బంది పెట్టొద్దని వారు విజ్ఞప్తి చేశారు. చిరు వ్యాపారం చేసుకుని వారి కుటుంబాలను పోషించుకుంటు జీవనం గడుపుతున్నారని ఏళ్ల తరబడి వ్యాపారాలు చేసుకుంటూ న్నవారికి అక్కడే వ్యాపారం చేసుకోవడానికి అవకాశం కల్పించాలని కమిషనర్ కి తెలిపారు. వారికి స్ట్రీట్ వెల్డింగ్ యాక్ట్ చట్టం ప్రకారం గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. లేని పక్షంలో నగరంలో ఉన్న తోపుడు బండ్ల వ్యాపాం స్తులందరినీ ఐక్యం చేసి పెద్ద ఎత్తున పోరాటం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తోపుడుబండ్ల వ్యాపారస్తులు శ్రీనివాసులు అశోక్ వెంకటేష్ అమీర్ చంద్రశేఖర్ రాజేష్ సుకన్య జీవరాజ్ పాల్గొన్నారు.

జిల్లా మహాసభలు జయప్రదం చేయండి: ఎస్ఎఫ్ఐ



ప్రజాశక్తి - క్యాంపస్: ఈ నెల 28,29 తేదీలలో ఎస్‌వి యూనివర్సిటీ లో నిర్వహించనున్న ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలు విద్యార్థులు తరలివచ్చి జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు మురళీ తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎస్ఎఫ్ఐ నాయకులతో కలిసి బుధవారం పోస్టర్స్ విడుదల చేశారు. జిల్లా మహాసభ లలో సత్యవేడు ప్రభుత్వ విద్యా రంగం సమస్యలు పై చర్చిస్తామని, భవిష్యత్తు లో విద్యా రంగం సమస్యలు పరిష్కారం కోసం కార్యక్రమాలు రూపొందించుకోడానికి ఈ మహాసభ వేదిక కానుందని వారు తెలిపారు. సత్యవేడు లో శ్రీ సిటీ పెద్ద పరిశ్రమ వున్నా విద్యా రంగం సమస్యలు అనేకంగా ఉన్నాయని విద్యా అభివృద్ధి లేదని వారు అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల కు సొంత భవనాలు లేక అవస్థలు పడుతున్నారన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల లో అనేక సమస్యలు నెలకొన్నాయని వసతి గృహాలు పూర్తిగా పడిపోయే పరిస్థితులు వున్నాయని తెలిపారు. సత్యవేడులో విద్యా రంగంపై అధికారులు, ప్రజాప్రతినిధులు మొద్దు నిద్ర వీడి పరిష్కరించాలని కోరారు.

అంతర్జాతీయ సదస్సు సమాచార పత్రిక విడుదల

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ వృక్షశాస్త్ర విభాగం, పారంపర్య వైద్య మహాసంఘం సంయుక్తంగా "సంప్రదాయ ఔషధం : ఆధునిక, సహజ చికిత్సల ఏకీకృత విధానం" అనే అంశంపై ఏప్రిల్ 9 నుంచి 11 వరకు మూడు రోజులపాటు అంతర్జాతీయ సదస్సును నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన సమాచార పత్రికను బుధవారం విసి చాంబర్ లో ఇంచార్జీ విసి ఆచార్య అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య మాదాల భూపతి నాయుడు, సిడిసి డీన్ కెసి రాయుడు, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ కేటీ రామకృష్ణారెడ్డి, ఆచార్య డా. కామేశ్వరరావు బద్రి (యుఎస్ఎ) చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ రీసెర్చ్ డిన్ ఆచార్య నరసింహ, డెవలప్మెంట్ డీన్ ఆచార్య బాలాజీ, ఆచార్య సరిత పాల్గొన్నారు.

క్రైం న్యూస్

డ్రైవర్ కిడ్నాప్

తోటి స్నేహితులే కిడ్నాప్ చేసి చావబాదిన వైనం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: డ్రైవర్‌గా పనిచేస్తున్న ఓ వ్యక్తి తోటి స్నేహితుల కిడ్నాప్ చేసి సావుబాది వదిలివేసిన ఘటన బుధవారం వెలుగు చూసింది. పోలీసులు కథనం మేరకు.. తిరుమలలో ఓ వ్యక్తి వద్ద ఇబ్రహీం 5 సంవత్సరాలుగా డ్రైవర్ గా విధులు నిర్వహిస్తున్నాడు. ఆరు నెలల క్రితం సొంత వాహనాన్ని తీసుకుని డ్రైవర్ గా కొనసాగుతున్నాడు.ఓర్వలేని గత యజమాని కొర్లగుంటలో బాధితుడి రూమ్ వద్ద నుండి మాయ మాటలతో తీసుకెళ్లిన తోటి స్నేహితులతో కలిసి కొట్టి చంపేస్తామంటూ బెదిరించారు. ఉదయగిరి లోనున్న తన అక్క సల్మా విషయం తెలుసుకొని100 కాల్ చేసి ఫిర్యాదు చేసింది. దీంతో బాధితుడు నవీన్, అస్లాం ,రాజేష్ హరి లపై ఈస్ట్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన బుధవారం తిరుపతిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు ఈస్ట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గణేష్ లాడ్జి రూమ్ నెంబర్ 101లో తమిళనాడు రాష్ట్రం, విరుద్ నగర్ జిల్లా,కు చెందిన రాధాకృష్ణన్ కుమారుడు జయకన్నన్ గా అనుమానాస్పద రీతిలో మృతి చెందాడు. ఈనెల 21న 11 గంటలకు లాడ్జికి వచ్చిన జయకన్నన్ 22వ తేదీ ఉదయం లాడ్జి రూమ్ బాయ్ తలుపులు తట్టిన తీయకపోవడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. లాడ్జి సిబ్బందిచే పోలీసుల ఆధ్వర్యంలో తలుపులు బద్దలు కొట్టారు. బెడ్ పై పడుకున్న వ్యక్తి పడుకున్నట్లే మృతి చెంది ఉన్నాడు. మద్యం సేవించినట్టు రూమ్ లో ఆనవాళ్లు వున్నాయి. పోలీసులు మృతదేహాన్ని రూయా ఆసుపత్రికి తరలించి, మృతుడి వద్ద లభించిన ఫోన్ ఆధారంగా బంధువులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



శిక్షణా శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు, అకాడమీ ప్రతినిధులు

ఎమరాల్డ్స్‌లో ఇన్ఫోసిస్ శిక్షణా శిబిరం

ప్రజాశక్తి-తిరుపతి (మంగళం): తిరుపతి నగర పరిధిలోని ఎమరాల్డ్స్ డిగ్రీ కళాశాలలో ఐసిటి అకాడమీ చెన్నైవారు ఇన్ఫోసిస్ ఫౌండేషన్ సౌజన్యంతో ఫైనల్ ఇయర్ డిగ్రీ విద్యార్థులకు ఫినిషింగ్ స్కూల్ ఫర్ ఎంప్లాయిబిలిటీ పేరిట ఉద్యోగ నైపుణ్య శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారని ఆ కళాశాల ఉపసంచాలకులు మునిరత్నం తెలిపారు. ప్రధానంగా ఈ శిక్షణ శిబిరం ద్వారా బ్యాంకింగ్, ఐటి, ఇన్సూరెన్స్, కమ్యునికేషన్ స్కిల్స్‌పై నెల రోజులపాటు శిక్షణ ఇవ్వనున్నామన్నారు. ఈ శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఐసిటి అకాడమీ ప్రతినిధులు నాగేశ్వరరావు, ప్రశాంత్ కోరారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ మధన్ మోహన్, శ్రీనివాసులు రెడ్డి, విద్యార్థినివిద్యార్థులు పాల్గొన్నారు.

కీటకాల వ్యాధులపై సెమినార్



బహుమతులు అందిస్తున్న సెమినార్ నిర్వాహకులు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): చెన్నై సవితా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ అండ్ టెక్నికల్ సైన్సెస్ (సీమాట్స్)లో బుధవారం కీటకాల ద్వారా సంక్రమించే వ్యాధులపై అంతర్జాతీ య సెమినార్ ఇండియన్ చాప్టర్ ఫార్ వెక్టర్ ఏంకాలజీ, అకాడమీ ఆఫ్ పబ్లిక్ హెల్త్ ఎంటమాలజీల విభాగాలు సంయుక్తంగా నిర్వహించాయి. ఈ సందర్భంగా సీమాట్స్ వ్యవస్థాపకుడు, చాన్స్ లర్ డాక్టర్ ఎన్ఎం వీరయ్యన్ దేశంలో కీటకాలవల్ల వ్యాధుల సంక్రమణ పెరుగుతోందని, దీంతో వ్యాధి నివారణలో కీలకమైన ఎంకమాలజీ నిపుణుల సంఖ్య పెరగాల్సి ఉందన్నారు. దంత వైద్య కళాశాలలో ప్రథమ స్థాయికి చేరుకుని ప్రస్తుతం మూడవ స్థానంలో ఉందన్నారు. దేశంలో మొదటి స్థానానికి చేరుకోవడానికి ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాజ్ పాల్ యాదవ్, దీపక్ నెల్లస్వామి, నార్బర్ట్ బెకర్, షీజా వర్గీస్, ముత్తుస్వామి పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: రాష్ట్రీయ సేవ సమితి (రాస్) మహిళా పొదుపు సంఘాల సభ్యుల సౌకర్యార్థం రాస్ ప్రధాన కార్యదర్శి వెంకటరత్నం, డైరెక్టర్ నాగరాజు ఆదేశాను సారం రాచపాలెం క్లస్టర్ తొర్రూరు లో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించి వైద్య పరీక్షలు నిర్వహించారు. టాటా ట్రస్ట్ హాస్పిటల్, తిరుపతి వారి (శ్రీకర్) ఆధ్వర్యంలో బిపి, షుగర్, హైపటైటీస్, నోరు , రొమ్ము, గర్భ సంచి వంటి ఆరోగ్య సమస్యలకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. అంతకుముందు కాన్సంపై మహిళలకు అవగాహన కల్పించారు. 110 మంది మహిళలు , పురుషులకు వైద్య పరీక్షలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో తొర్రూరు గ్రామసర్పంచ్ వసంతమ్మ , డాక్టర్ వెంకయ్య బాబు, రెడ్డి కుమారి, మహేంద్ర, అమరా వతి, రాస్ సిబ్బంది తేజ, జయలక్ష్మి, ద్రాక్షాయణి, సభ్యులు, లీడర్లు పా ల్గొన్నారు.

పెత్తందారులపై చర్యలు తీసుకోవాలి: సిఐటియు

ప్రజాశక్తి - కెవిబిపురం: స్థలం కబ్జాకు యత్నిస్తున్న పెత్తందారులపై చర్య తీసుకోవాలని కలెక్టర్‌కు సిఐటియు జిల్లా కార్యవర్గ సభ్యులు మునిరాజా విజ్ఞప్తి చేశారు. కెవిబి పురం మండలం కర్లపూడి గ్రామంలో గత 30 సంవత్సరాలుగా మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల భవనం వుంది. ప్రస్తుతం ఆ భవనంలో ప్రజా ప్రయోజనాల కోసం రేషన్ బియ్యం ఇస్తున్న ఆ భవనాన్ని గ్రామ పెత్తందారులు ప్లాన్ ప్రకారం కూల్చివేసి ఇతరులకు అమ్మి సొమ్ము చేసుకోవాలని గ్రామ పెత్తందారులు యత్నిస్తున్నారన్నారు. వెంటనే కలెక్టర్ స్పందిందించి మండల తహశీల్దారు ద్వారా విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి-తిరుపతి సిటీ: తిరుపతి లో 220కె.వి.లైన్, రేణిగుంట 132 కె .వి లైన్ తిరుపతి పరిధిలో నీ 11 కె.వి. పానకం ఫీడర్ 11 కె.వి. వేమూరు ఫీడర్లో పానకం , వేమూరు, గంగనగుంట, మిట్టమీద కండ్రిగ , కస్తూరి కండ్రిగ, ముండ్లపూడి ఫీడర్లు మరమ్మతులు కారణంగా తేదీ 23 తేది గురువారం ఉదయం 8.00 గంటల నుండి సయంత్రం 5.00 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అని ఏపిఎస్పిడి.సీఎల్ ఆపరేషన్ టౌన్ డివిజన్ విద్యుత్ ఈ.ఈ. వి.చంద్ర శేఖర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా పరిసర ప్రాంతాల వినియోగదారులు అంతరాయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

వెండి వస్తువుల బహూకరణ

ప్రజాశక్తి -సూళ్లూరుపేట: సూళ్లూరుపేట చెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారికి వెండి వస్తువులను స్థానికులు ఇమ్మానేని సత్యనారాయణ, బాబామని, ఇమ్మానేని చంద్రశేఖర్ రావు, చంద్రమతి దంపతులు ఆలయం సహాయక కమిషనర్ ప్రసన్న లక్ష్మికి బుధవారం అందించారు. సుమారు ఏడులక్షల యాభై వేల రూపాయలు విలువు చేసే సుమారు 6 కిలోల 400 గ్రాములు బరువు కలిగిన అమ్మవారికి నైవేద్యం సమయంలో ప్రసాదాలకు ఉపయోగించే విధంగా రెండు ప్రసాదం వెండి గంగాళాలు తో పాటు ఒక వెండి దివిటీని కూడా ఇమ్మానేని కుటుంబం అందించింది. ఈ కార్యక్రమంలో ఇమ్మానేని శ్రీనివాస రావు దంపతులు పాల్గొన్నారు.

టిటిడికి విరాళంగా మరో కియోస్క్ యంత్రం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: తిరుపతిలోని శ్రీ గోవిందరాజ స్వామి ఆలయానికి బుధవారం సాయంత్రం కియోస్క్ యంత్రాన్ని ఎస్ బి ఐ విరాళంగా అందించింది. క్యూ ఆర్ కోడ్ యంత్రంతో యూపిఐ మోడ్ లో రూ. లక్ష వరకు భక్తులు విరాళంగా అందజేయవచ్చు.

కబ్జా నుండి భూమిని రక్షించండి..



కంచె తొలగించి కబ్జా భూమిని రక్షిస్తున్న స్థానికులు

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: మండల తహశీల్దారు కార్యాలయం ఎదుటే కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని అప్పనంగా కబ్జా చేసి కంచె వేసుకుంటున్నా స్థానిక రెవెన్యూ అధికారులు ఆ వైపు కన్నెత్తి చూడకపోవడం అన్యాయమని వెంటనే భూమిని కబ్జా దారుల నుండి రక్షించాలని కోరుతూ సిపిఐ ఆధ్వర్యంలో ఎంపిడివో కార్యాలయం ఎదుట బుధవారం నిరసన వ్యక్తం చేశారు. దీంతో ఎంపిడీవో కార్యాలయం దద్దరిల్లింది. స్థానికుల కథనం మేరకు.. బుచ్చినాయుడు కండ్రిగ తహశీల్దారు కార్యాలయం ఎదుట వున్న కనమనంబేడు గ్రామ పంచాయతీకి సంబంధించి సర్వేనెంబర్ 252, 253, 254 పరిధిలోని మొత్తం 15 ఎకరాల విస్తీర్ణంలో మూడు ఎకరాల అనాధీనం భూమిని డాక్టర్ బత్తయ్య నాయుడు అనే వ్యక్తి అక్రమంగా ఆక్రమించుకొని పండగల సమయంలో రెవెన్యూ అధికారులు సెలవులో ఉన్న సమయంలో అక్రమంగా జెసిబి తో చదును చేసుకుని రాతి స్తంభాలు నాటి ఇనుప కంచె ఏర్పాటు చేసుకొని ఆక్రమించుకున్నాడన్నారు. తహశీల్దారు కార్యాలయం ఎదుటే ఇది జరిగినా రెవెన్యూ అధికారులు స్పందించక పోవడంపై నిప్పులు చెరిగారు. స్థానిక ఎస్ఐ విశ్వనాథ నాయుడు స్థానిక ప్రజలకు నచ్చచెప్పే ప్రయత్నం చేసినా వారు వినిపించుకోలేదు. వెంటనే కబ్జాలను తొల గించాలని కోరుతూ ఎంపీడీవో కార్యాలయం వద్ద జరుగుతున్న సర్వసభ్య సమావేశం వద్దకు వచ్చి ఆందోళన చేపట్టారు. వారి ఆందోళనతో సమావేశం నుంచి బయటికి వచ్చిన స్థానిక ఎమ్మెల్యే ఆదిమూలం తహశీల్దారు, ఆందోళనకారులతో మాట్లాడారు. బాధితుల నుంచి వినతిపత్రం స్వీకరించారు. త్వరలోనే సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కానీ వాళ్ల హామీని పట్టించుకోని స్థానికులు కబ్జా స్థలంలో అక్రమంగా ఏర్పాటు చేసిన ఇనుప కంచెను తీసివేశారు. ఈ సందర్భంగా సిపిఐ నాయకులు మాట్లాడు తూ...వెంటనే కబ్జా కోరల నుండి భూమిని రక్షించాలని కోరారు. ఈ కార్యక్రమం లో సిపిఐ నాయకులు చిన్నిరాజు, స్థానిక ప్రజలు, హరిజన, గిరిజనులు పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాసంతోనే బంగారు భవిష్యత్తు



ప్రజాశక్తి -తిరుపతి టౌన్ : చిన్ననాటి నుండి విద్యార్థిని విద్యార్థులకు వ్యక్తిత్వం వికాసం పై అవగాహన ఉంటే వారికి బంగారు భవిష్యత్తు ఉంటుందని ఇంపాక్ట్ మోటివేషనల్ స్పీకర్ , రేవతి ఫౌండేషన్ ఫౌండర్ అండ్ ఛైర్మన్ పోలీస్ రామ్మూర్తి అన్నారు. తిరుపతి సత్యనారాయణపురం ప్రభుత్వ జడ్పీ హైస్కూల్లో బుధవారం విద్యార్థిని విద్యార్థులకు ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ విస్డం క్లబ్ తిరుపతి అధ్యక్షులు, రీజినల్ డైరెక్టర్, ఉయ్ సపోర్ట్ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ అండ్ ఛైర్మన్ తహ సున్నీసా బేగం ఆధ్వర్యంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సంధ్యారాణి అధ్యక్షతన వ్యక్తిత్వ వికాసం పై అవగాహన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై న ఆయన మాట్లాడుతూ చిన్ననాటి నుండి విద్యార్థిని విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం పై అవగాహన ఉండాలన్నారు. అప్పుడే వారి లక్ష్యాన్ని సాధించవచ్చునని తెలిపారు. ఆ దిశగా విద్యార్థిని విద్యార్థులు నేర్చుకోవాలని తెలిపారు. అనంతరం తహ సున్నీసా బేగం మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థుల భవిష్యత్తు వ్యక్తిత్వ వికాసం పై ఆధారపడి ఉంటుందన్నారు. చిన్ననాటి నుండి మంచి చెడులను తెలుసుకుంటూ పిల్లలు ఎదగాలని సూచించారు. అప్పుడే తల్లిదండ్రులకు సమాజానికి రాష్ట్రానికి దేశానికి మంచి జరుగుతుందని అన్నారు . ప్రతి ఒక్కరికి వ్యక్తిత్వ వికాసం పై అవగాహన ఉండాలని ఇలాంటి కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి హాజరైన వారికి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు డాక్టర్ సంధ్యారాణి ఉపాధ్యాయుల బృందం శాలువా, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సత్కరించి అభినం దించారు. ఈ కార్యక్రమంలో ఇంపాక్ట్ ట్రైనర్స్ నాదముని , ముఖేష్ ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.